


"ఆయనే కొత్తగా వచ్చిన యింగ్లీషు లెక్చెరర్''

"పేరేమిటో?"

"నారాయణరావుగారుట."

''ఎలా చెప్తారో ఆ రామారావు గార్లా ఆడపిల్లలమీద ఛలోక్తులు విసుర్తూ చంపుకుతినరుకదా?''

"ఏమో మరి ఇంతకీ మనకు

వస్తారో రారో?"

"ఎందుకు రారులే. రామారావుగారికి ట్రాన్స్‌ఫరయిన తరువాత మన 'డ్రామా' మొహం చూసిన నాథుడులేడు. మన డ్రామాకి యీయనే వస్తారు తప్పక. చూడు నామాట నిజమై తీర్తుంది."

"ఇంతకూ ఎవరా నారాయణరావు గారు!" అంటూ ఆంతవరకూ ఆయన్ని గురించి మాట్లాడుతున్న ఆడపిల్లల గుంపును తోసుకుని బయటకు వచ్చాను నేను.


మా లేడీస్‌రూమ్ పక్కనే యింగ్లీష్ స్టాఫ్‌రూమ్ ఉంటుంది.

రూమ్‌ముందు రాజన్‌గారితో మాట్లాడు తున్న కొత్త మనిషిని చూపింది కమల. "ఆయనే నారాయణరావుగారు," అంటూ. సన్నగా, పొడుగ్గా, చామనచాయగా ఉన్న నారాయణరావుగారికి దాదాపు నలభై ఏళ్ళుంటాయి. చేతిలో పుస్తకాలు పట్టు కుని నవ్వుతూ ఏదో మాట్లాడుతున్నాడు రాజన్‌గారితో. ఆయన రూపురేఖలను చూచి షేక్స్పియర్ ట్రాజెడీని రసవత్త రంగా చెప్పగల సత్తా యీయనలో ఎంతవరకుందా అని అంచనా వేస్తూ నిల్చున్నాను నేను. ఎందుకో చూడగానే ఆయన మా డ్రామాక్లాస్‌కొస్తే బాగుండు ననిపించింది. ఆరోజు మాకు ఇంగ్లీష్ పోయెట్రీ. మళ్ళీ రెండురోజుల వరకు డ్రామాక్లాస్ లేదు. బుధవారం ఎప్పుడు వస్తుందా, కొత్తలెక్చెరర్ పాఠం ఎప్పుడు వింటామా అని తహతహలాడిపోతు న్నాం, లేడీస్ వైటింగ్‌రూమ్‌లో మేమంతా. "ఆయన మొహం చూస్తే బాగానే చెప్పేట్టున్నా"రని కొందరు; "ఏమో నా కేం నమ్మకంలే"దని ఒకరూ; "ఆయన చెప్పినా, చెప్పకపోయినా మన 'గైడ్సు' ఉండనే ఉన్నాయికదా," అని ఒకరూ యిలా ఎవరికితోచిన అభిప్రా యాలు వాళ్ళు వెళ్ళడించుకున్నాం బి.ఏ. సెకండియర్ లేడీ సందరం.

చివరకు ఎదురుచూసిన బుధవారం రానే వచ్చింది. ఇంగ్లీష్‌క్లాస్ ఫస్టవరే అవటంవలన ఆరోజు త్వరత్వరగా పనులు చేసికొని, అన్నంకూడా సరిగ్గా తినకుండా, కాలేజీకి పరుగెత్తుకు వెళ్లాను, ఏమిటో ఆ అమాయకత్వం! ఆ రోజుల్లో ఎవరైనా కొత్తలెక్చెరర్ వచ్చారంటే అదికూడా ఒక ముఖ్యమైన విషయమే. ఎంత సేపూ చదువూ, కాలేజీ, పుస్తకాలూ, స్టూడెంట్సూ, లెక్చెరర్లూ... యివి తప్ప మరో ప్రపంచం ఉంటుదన్న ఆలోచన కూడా ఉండేది కాదు నా కప్పుడు.

నాఅంత కాకపోయినా చాలావరకు మిగతా ఆడపిల్లలుకూడా ఆదుర్దాగానే ఉన్నారు. అందరం సెకండ్‌బెల్లవక ముందే వెళ్ళి క్లాస్‌లో కూర్చున్నాం.

"ఏంరోయ్, యీరోజింత ముం దుగా వచ్చారేం. కొత్తలెక్చరర్ వస్తారని సంబరం కాబోలు;" విద్యార్థుల బెంచీల నుండి ఒక రిమార్కు వచ్చింది. అదేదో




పెద్ద జోకయినట్లు, మిగతావాళ్ళంతా పగలబడి నవ్వుకుంటే మేం అవేమీ విననట్లు ముఖాలు పుస్తకాల్లో దాచుకుని కూర్చున్నాం

సెకండ్ బెల్లయింది. రెండవగంట కొట్టిన ఒకటిన్నర నిమిషాలకి నారాయణరావుగారు క్లాస్‌లో అడుగుపెట్టారు.


క్లాసంతా ఒక్కసారి నిశ్శబ్దమయింది టకటకమనే మాస్టారి బూట్ల చప్పుడు తప్ప మరేమీ విన్పడటం లేదు. ఆయన ఠీవిగా నడచివెళ్ళి కుర్చీలో కూర్చున్నారో లేదో వెనక బెంచీల్లో ఒకడు "హాచ్" మంటూ తుమ్మాడు అంతే_ ఇక క్లాసంతా నవ్వులతో చప్పట్లతో దద్దరిల్లిపోయింది. చెప్పొద్దూ ... ఓ పక్క మాస్టారి స్థితికి జాలేసినా, నేనుకూడా నవ్వాపుకోలేకపోయాను. పొట్టలు చేత్తో పట్టుకుని ముందుకూ వెనక్కీ ఊగుతూ మేమంతా నవ్వాపుకోలేక అవస్థపడ్డాం. నవ్వీ నవ్వీ అందరికీ కళ్ళనీళ్ళుకూడా వచ్చాయి. చివరికి క్లాసంతా సర్దుకునేసరికి ఐదు నిమిషాలు పట్టింది

కొత్తగా వచ్చిన ప్రతి లెక్చరర్‌నీ మాక్లాసు విద్యార్థులు ఆహ్వానించే పద్ధతి యిదే. అలాటి విషయాలు బాగా అనుభవమే కాబోలు_మాస్టారు ఓ పట్టాన తొణకలేదు ముఖం మాత్రం కొంచెం బట్టపడింది ఆయనలా మౌనంగా అటెండెన్సు రిజిస్టర్‌వంక చూస్తూ కూర్చునేసరికి కొంటెకుర్రాళ్ళ నోళ్ళు వెంటనే మూతపడ్డాయి సామాన్యంగా అలాటి సమయాల్లో లెక్చరర్లు యింగ్లీషులో బడబడా నాలుగు తిట్టటమో లేదా

'ఇలాటి ఫిష్‌మార్కెట్లో నేను పాఠమే చెప్పను', అంటూ కోపంగా వెళ్ళిపోవటమో చేస్తారు. కాని, యీాయన మాత్రం శిలా విగ్రహంలా ముఖంలో ఎలాటి ఫీలింగ్సూ లేకుండా కూర్చునేసరికి అందరికీ ఆశ్చర్యం వేసింది కాబోలు, మళ్ళీ ఎవరి నోటివెంబడీ ఒక్కమాటకూడా రాలేదు. ముఖ్యంగా ఆ విగ్రహాన్ని చూసి నాకు ఆయనంటే ఒకరకమైన గౌరవభావం కలిగింది.

అటెండెన్సు తీసుకోగానే లెసన్ మొదలుపెట్టారు నారాయణరావుగారు. మొదట క్లుప్తంగా ఒక పావుగంటసేపు షేక్స్పియర్ జీవితాన్ని గురించి చెప్పారు. ఆ తరువాత ఆంగ్ల సాహిత్యంలో విషాదాంత నాటికలకు గల ప్రాముఖ్యాన్ని వివరించారు. సాహిత్యంలో ట్రాజెడీలకు గల స్థానాన్ని గురించి ప్రాక్పశ్చిమ దేశాలలో అభిప్రాయభేదా లున్నాయి. ప్రాచ్యదేశాల్లో ముఖ్యంగా భారతదేశపు ప్రాచీన సాహిత్యంలోని కథలన్నీ సుఖాంతాలే. ధర్మానికీ, సత్యానికీ ఎప్పుడూ – చివరిదశలోనైనా విజయం లభించి తీరుతుంది అని నిరూపించేవారు. విషాదాంత గాథలు పాఠకుల మానసికారోగ్యానికి అంతగా మంచివి కావని ప్రాచీన భారత కవుల అభిప్రాయం. కాని పశ్చిమదేశపు సాహిత్యంలో ట్రాజెడీకి అనాదినుండీ ఒక గౌరవమైన స్థానం ఉంటూ వచ్చింది. కామెడీలకన్నా ఎక్కువగా ట్రాజెడీలే పాఠకుల హృదయాల్లో కలకాలం నిల్చిపోగలవనీ, పాఠకుల కరుణనూ, సానుభూతినీ పొందటానికి విషాద పాత్రలే తగినవని వారి అభిప్రాయం. విశ్వసాహిత్యంలో కలకాలం నిలిచిపోయే విషాద పాత్రలను సృష్టించటంలో షేక్స్పియర్ చూపిన విశిష్టతా, ఔన్నత్యం వర్ణించి చెప్తుంటే మే మందరం మంత్రముగ్ధుల్లా బెంచీలకు అతుక్కుపోయాం. బెల్లెప్పుడయిందో కూడా తెలియలేదు. మాస్టారు క్లాసు విడిచిపోతుంటే అదోలా అయిపోయింది మనసు.

మర్నాడుకూడా డ్రామా క్లాసుంది. ఆ రోజుకూడా తన వాగ్ధాటితో నారాయణరావుగారు మమ్మల్ని కట్టివేశారు. ఆయేడు మా కున్న డ్రామా పేరు 'యాంటోనీ అండ్ క్లియోపాట్రా.' కారక్టర్‌లోని వైవిధ్యాన్ని గురించి వర్ణించి చెప్తుంటే ఓపక్క ఆనందం, మరోపక్క ఆశ్చర్యం, జాలీ, కోపం అన్నీ కలిగేవి. విభిన్న భావాల కలయికతో, అద్భుతమైన సౌందర్యముతో యాంటోనీనే కాక పాఠకుల మనస్సులన్నిటినీ ఆకట్టుకునే విచిత్రమైన పాత్ర క్లియోపాట్రా. ఆ పాత్రకు జీవం పోసి, ఆమె మాటలకు మెరుగులు దిద్ది మా హృదయాల్లో హత్తుకుపోయేటట్లు చెప్పేవారు నారాయణరావుగారు. అత్యంత




పరాక్రమశాలి, సాహసోపేతుడూ ఆంటోనీ అద్భుత సౌందర్యరాశి అయిన క్లియోపాట్రా మోహపాశాల్లో చిక్కుకుని ఆ అందపు కైపులో రాచకార్యాలను విస్మరిస్తాడు ఓప్రక్క క్లియోపాట్రాను వదులుకోలేక, మరోవంక నానాటికీ తనలో జరుగుతున్న నైతిక పతనానికీ, పరాక్రమ క్షీణతకీ క్రుంగిపోతూ, భయంకరమైన మానసిక సంక్షోభానికి గురి అవుతున్న యాంటోనీ మనస్తత్వాన్ని వర్ణించి చెప్తుంటే మా అందరికీ గుండెలు బరువెక్కేవి

అలా కొద్దిరోజుల్లోనే విద్యార్థు లందరికీ ఆయన క్లాసంటే ఎంతో యింటరెస్టు కలిగించారు. ఆ మాస్టారిమీది యిష్టంకొద్దీ యింగ్లీష్ డ్రామా అందరం బాగా చదివే వాళ్ళం లీజర్ చిక్కినప్పుడల్లా లేడీస్ రూమ్‌లో క్లియోపాట్రా పాత్రని గురించిన చర్చలు బయలుదేరేవి.

హాఫియర్లీ పరీక్షలు వ్రాశాం. సెలవు లైనాక పేపర్లిచ్చారు ఇంగ్లీష్ డ్రామాలో ఫస్టుమార్కు నాదే. పేపరు తీసుకుంటూ నారాయణరావుగారి ప్రశంసావాక్యాలు వింటూంటే నామనసు ఆనందంతో గంతులు వేసింది. ఆరోజు నా కెంత గర్వం కలిగిందనీ! అప్పటి నుండీ ఆయన నా యెడల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవటం మొదలుపెట్టారు నేనుకూడా ఎస్సేలు ప్రిపేర్ చేసి ఆయన చేత దిద్దించుకునేదానిని

ఒకరోజు ఏదోపుస్తకం కావలసి వస్తే, ఆయన నడిగాను. కాలేజీలో.

సాయంత్రం తమ యింటికి వచ్చి తీసుకో మని. ఆ పుస్తకం వాళ్ళ యింట్లోనే ఉందనీ చెప్పారు. మా యింటికి దగ్గ ర్లోనే మాస్టారియిల్లు. ఆయన భార్యని పిల్లలను చూసిన ట్లవుతుందని ఆయన యింటికి వెళ్ళటానికి వెంటనే అంగీక రించాను.

సాయంత్రం కాలేజీ అయినాక నారా యణరావుగారింటికి వెళ్ళేను. నేను వెళ్ళే సరికి ఆయన వరండాలో కూర్చుని నలుగురు విద్యార్థులకు ప్రైవేట్ చెప్తు న్నారు. నేను నమస్కారం చెయ్యగానే "రామ్మా, రా; నీకోసమే చూస్తున్నా; లోపలికి వెళ్ళి పిన్నితో మాట్లాడుతుండు, నే నిప్పుడే వస్తా," నన్నారు.

నేను బిడియపడుతూ లోపలికి నడిచాను.

రేడియో బల్లముందు సోఫాలో కూర్చుని ఒక పాతికేళ్ళ స్త్రీ స్వెటర్ అల్లు తోంది. ఆమె ఏమంత అందగత్తె కాక పోయినా కళ్ళల్లో మాత్రం తెలివితేటలు ఉట్టిపడుతున్నాయి. కట్టూ, బొట్టూ అన్నీ పొందికగా ఉన్నాయి. చూడగానే మంచి సంస్కారంగల స్త్రీలా కనపడుతుంది.

నేను నమస్కరించగానే ఆమె ప్రతి నమస్కారం చేసి నవ్వింది.

"రండి. కూర్చోండి. మీపేరు శశి రేఖ కదూ? మాస్టారెప్పుడూ మీగురించి చెప్తూనే ఉంటారు—చాలా తెలివైన పిల్ల వని."

నేను కొంచెంగా నవ్వి ఆమె ఎదు రుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

"'షేక్స్పియర్ ట్రాజెడీ' ఎస్సే ప్రిపేర్ చెయ్యటానికి బుక్సు కావా లన్నారుట గా?" అన్నది ఆమె.

"అవునండీ!" అన్నా మెల్లగా, లోలోపల ఆశ్చర్యపోతూ: కాలేజీలోని విద్యార్థుల చదువులను గురించి అంత శ్రద్ధగా భార్యతో చెప్పే ఆయన ఎంత మంచివారో అనుకున్నాను.


తర్వాత కాసేపు పుస్తకాలను గురించీ, కాలేజి లెక్చరర్లు గురించీ, స్టూడెంట్సు— ఇలాటి విషయాలన్నీ మాట్లాడుకున్నాం.

"మీరెంతవరకు చదువుకున్నారు?" అనడిగాను నే నామెని — ఆమె పేరు రమణిట.

మెట్రిక్ పాసయ్యానండీ," అంది.

కాని ఆవిడ ఆంగ్లభాషా పరిజ్ఞానం బి. ఏ. వాళ్ళ స్టాండరుకు మించివుంది.

మాస్టారు గదిలోకి తీసుకువెళ్ళి, ఆయన బుక్సన్నీ చూపించింది రమణి. ఆ బీరువాల నిండుగా ఎన్ని పుస్తకాలో! కళ్ళు తిరిగిపోయినయ్. అందులో సగం పైగా చదివిందిట! అంతేకాక ప్రతిరోజూ ట్యూషన్ చెప్పించుకుందుకు వచ్చే విద్యార్థులకు మాస్టారు పాఠాలు చెప్తుంటే తను పక్కగదిలో కూర్చుని శ్రద్ధగా వింటుందిట. ఆవిడ ఇదంతా చెప్తుంటే 'స్వర్గమన్న వేరే కలదా!' అనిపించింది నాకు. అనునిత్యం సాహితీమతల్లి సేవలో




నిమగ్నులు అయ్యే ఆ పుణ్యదంపతులు ఎంత అదృష్టవంతులో అనుకున్నాను.

మే మిద్దరం ఇలా మాట్లాడుకుంటుండగా ఓ పదిహేనేళ్ళ కుర్రవాడు వచ్చి పుస్తకాలు మంచంమీదకు విసిరేసి "అమ్మా, త్వరగా టీ యివ్వు, కాలేజీలో క్రికెట్ మాచ్ ఉంది పోవాలి," అన్నాడు

రమణి "ఇప్పుడే వస్తాను. కాళ్ళూ చేతులూ కడుక్కురా,'' అంటూ లోపలికి పోయి ఫ్లాస్కూ, మూడు కప్పులుతో తిరిగి వచ్చింది మేం ముగ్గురం టీ తీసుకున్నాక ఆకుర్రవాడువెళ్ళిపోయాడు.

ఆ పిల్లవాడు రమణిని 'అమ్మా' అని పిలుస్తుంటే ఆశ్చర్యం వేసింది. వారిద్దరికీ వయసులో పదేళ్ళకంటే ఎక్కువ తేడా వుండదు.

ఆతని పేరు గోపీట. గోపీ వెళ్ళాక "ఆ అబ్బాయి ఎవరు?" అని అడిగాను

"నాకొడుకు," అందిరమణినవ్వుతూ.

"ఆ......"

"అంటే అతను నా సవతి కొడుకు నేను మాస్టారికి రెండవ భార్యను గోపీ పుట్టిన ఏడాదిలోపలే తల్లి పోయింది."

కాసేపాగి నే నన్నాను, "గోపీ చాలా అదృష్టవంతుడు."

"ఎందుకో?"

"మీవంటి సవతితల్లి దొరకటం ఎన్ని జన్మల సుకృతమో ''

ఆవిడ మాట్లాడలేదు

క్షణం ఆగి అన్నది, "అందరూ అదృష్టవంతులే, నేను తప్ప "

చివుక్కు మన్నది నా మనసు, ఆవిడలా మాట్లాడుతుంటే రమణి ఎందుకో బాధ పడుతున్నట్లు తోచింది. కాని రెట్టించి అడగటానికి ఆ కొద్దిపాటి పరి

చయాన్ని ఉపయోగించుకునేపాటి ధైర్యం లేకపోయింది నాకు

ఆమె లేచి గోపీ విసిరేసిన పుస్తకాలన్నీ సర్ది టేబుల్ మీద పెట్టింది ఇంతలో నారాయణరావుగారు లోపలికి వచ్చారు, ఛలోక్తి విసుర్తూ సరదాగా మాట్లాడేరు అరగంట సేపు. రమణి కూడా ఆయనతోపాటు నవ్వుతూ మాట్లాడింది. చివరికి పుస్తకాలు తీసుకుని ఇంటికి వెళ్తుంటే అప్పుడప్పుడూ వస్తూండమని భార్యా భర్తలిరువురూ చెప్పారు.

మాస్టారేమో, "చూడు శశీ: నువ్వు నా పెంపుడు కూతురివి కనీసం వారానికోసారన్నా మా యింట్లో అటెండెన్సు వేయించుకోకపోయావంటే నీ జత పచ్చే," అన్నారు.

ముగ్గురం నవ్వుకున్నాం.

అవునమ్మా. నాకూ ఏమీ కాలక్షేపం అవటం లేదు వీలు చూసుకుని తప్పకుండా వస్తూండు,'' అన్నది రమణి. అలాగేనని యింటికి వచ్చేశాను

అప్పటినుండీ వాళ్ళ ఇంటి తరచూ వెళ్తూ ఉండేదానిని కొద్దిరోజులలోనే వారింట్లో సన్నిహిత బంధువులలో ఒకరుగా అయ్యాను

ఒక నెలరోజు లెందుకో చదువు గొడవలో పడి వాళ్ళింటికి వెళ్ళటం బొత్తిగా మానేశాను ఒకరోజు కాలేజీ అయినాక పంటరిగా తలవంచుకు పోతుంటే నారాయణరావుగారు కన్పడి పలకరించారు· "ఏమ్మా! బొత్తిగా నల్లపూస పైపోయినావే పిన్ని నీకోసం కలవరించిపోతోంది." అన్నారు

"ఏదోనంపీ, ఈ మహాసముద్రంలాటి చదువునుండి బయట పడాలంటే చాలా కష్టమయిపోతోంది. పిన్నిగారిని ఎక్స్యూజ్ అడిగినట్లు చెప్పండి రేపు సాయంత్రం రావటానికి ప్రయత్నిస్తాను." అన్నాను

"సరే, రేపు తప్పక రావాలి సుమా. లేకపోతే నేను నీకసలు చెప్పలేదని పిన్ని నామీద కోప్పడుతుంది రాత్రికి అన్నంకూడా పెట్టదు," అంటూ వెళ్ళిపోయాడు

మనసునిండా నవ్వుకున్నాను – ఎంత చక్కటి దాంపత్యమో ! రోజూ చిలిపి కజ్జాలతో నవ్వుల పువ్వులు కురిపిస్తూ జీవించే దంపతులు ఎంతమంది ఉంటారు?

ఆ మర్నాడెందుకో అన్నట్టుగా నారాయణరావుగారింటికి వెళ్ళలేకపోయాను మర్నాడు సోమవారం కాలేజీ నుండి రాగానే టీ తాగి మాస్టారింటికి బయలుదేరాను అప్పుడు సాయంత్రం ఆరుగంట లయివుంటుంది చల్లని గాలి తాకిడికి ఆకాశంలో దూదిపింజల్లా ఉన్న తెల్లని మేఘాలు మృదువుగా విడిపోయి మెల్లమెల్లగా కదుల్తున్నాయి. ఆ సమయంలో ఎందుకో నా మనసంతా ఒక విచిత్రమైన ప్రశాంతత, నిశ్చలత అప్ప



రించి ఉన్నాయి. బహుశా వాతావరణ ప్రభావంవల్ల కాబోలు.

మాస్టా రింటికి వెళ్ళగానే మామూలు ప్రకారం ఆయన ప్రైవేటు చెప్తూ కనిపించలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది ఓరగా వేసిఉన్న వీధితలుపులు నెట్టి లోపలికి వెళ్ళాను హాల్లోకూడా ఎవరూ లేరు. పక్కనేఉన్న గదివైపుకు తిరిగాయి నాకాళ్ళు దక్షిణవేపు కిటికీలో కూర్చుని బయటకు చూస్తూ, ఏదో ఆలోచిస్తోంది రమణి. రెండంగుళాల వెడల్పున నల్లని అంచుగల తెల్ల చేనేతచీర, తెల్లని జాకెట్టు ధరించిఉంది ఉదయంనుండి తల దువ్వుకోలేదు కాబోలును, వదులుగా వేసుకున్న చిక్కుముడి జారి బుజాల మీదకు వేలాడుతోంది పక్కనుండి చూస్తుంటే ఆమె చెవురింగునీడ ఆమె కుడిబుగ్గమీద విచిత్రంగా కదుల్తోంది బయట చల్లని వాతావరణం ... తెల్లని వలువలు ధరించి మౌన గంభీరముద్రలో

కూర్చుని శూన్యన్నవలోకిస్తున్న రమణి, ఆసమయంలో ఎంతో మనోహరంగా కన్పించింది నాకంటికి

నా రాకను సూచించేందుకు చిన్నగా దగ్గాను ఉలిక్కిపడి చూసింది రమణి

"ఓ...నువా! రా!" అన్నది

"క్షమించండి మీ ధ్యానముద్రకు భంగం కల్గించానేమో!"

"ధ్యానముద్రా, పాడా చేతినిండా పనిలేకపోతేసరి అడ్డమైన ఆలోచనలూ వస్తుంటాయి. అందుకే అంటారు 'Idle man's brain is a devil's work shop' అని," అంది కిటికీలోనుండి దిగి రమణి.

ఇద్దరం చెరోకుర్చీలో కూర్చున్నాం

"మీ రిప్పుడెంత అందంగా ఉన్నారో తెలుసా? నేనే కవయిత్రినైతేనా, అశువుగా నాలుగుపద్యాలు చెప్పేద్దును," అన్నాను కొంటెగా.

రమణి ఏం మాట్లాడలేదు

మాటకి మాట ఎదో ఛలోక్తి విసుర్తుందని ఆశించిన నేను ఆమె కనీసం చిరునవ్వయినా నవ్వకపోయేసరికి చిన్నబోయాను ఆమె సాలోచనగా నాకళ్లలోకి చూస్తూ మెల్లగా అంది, "భర్త మెచ్చని అందం, అత్త మెచ్చని గుణం అడదానికున్నా, లేకపోయినా ఒకటే అవును కదూ?"

గతుక్కుమన్నాను నేను ఒక్కక్షణం నాకంతా అయోమయంగా అయిపోయింది ఇదేమిటి రమణి — మా నారాయణరావుగారి భార్య — యిలా మాట్లాడుతోందేమిటి? అనిపించింది


"మీ రన్నది నిజమేననుకోండి కాని, అలాటి విషయాలు మీ నోటివెంబడి వింటుంటే నాకెందుకో బాగుండలేదు," అన్నా తడబడుతూ

"నా నోటివెంబడి అలాటిమాటలు రాకూడకపోవటానికి 'నా'లో ఏం ప్రత్యేకత ఉందని?" అన్నది రమణి అదోరకంగా నవ్వుతూ

"అబ్బే...అది కాదండీ. నారాయణరావుగారివంటి భర్తను పొందిన స్త్రీకి ఎలాటి విచారకరమైన ఆలోచనలూ రావని నాఉద్దేశ్యం," అన్నా ధైర్యంచేసి

"మీ మాస్టారిని గురించి నువ్వు చాలా ఉన్నతంగా ఊహించుకుంటూన్నావు శశీ! నువ్వు నారాయణరావుగారిని ఒక దృక్పథంలోనుండి మాత్రమే చూడగల్గుతున్నావు," అని, ఎటో చూడటం మొదలెట్టింది రమణి


'మిగలా దృక్పథాల్లో' నారాయణరావుగారు ఎలా ఉంటారో ఊహించుకుంటానికే భయమేసింది నాకు అప్పటి రమణి ముఖంలోకి చూస్తుంటే ఆరెండు నిముషాల నిశ్శబ్దంలో సృష్టిలోని చైతన్యమంతా ఒక్కసారి ఆగినట్లనిపించింది. నిశ్శబ్దాన్ని చీలుస్తూ వినివచ్చినయ్ రమణి మాటలు. "జీవితంలో అనుకోని సంఘటనలెన్నో ఎదురవుతయ్ శశీ!




వివాహాత్పూర్వం ఎన్నోమధురస్వప్నాలు కంటూ, ఏవేవో సుందర దృశ్యాలను ఊహించుకుంటూ గడపిన వ్యక్తి, వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టినాక ప్రతి మనిషీ ఆశించే కనీసపు సానుభూతినీ, ప్రేమనూకూడా పొందలేకపోతే, ఆ వ్యక్తి ఏం కావాలి? తన భావాలలో భావమై, తన హృదయంలో హృదయమై మెసలే జీవన సహచరునికోసం కలలు కన్న స్త్రీకి, భార్యని బానిసకన్నా నీచంగా, జంతువుకన్నా క్రూరంగా హింసించే భర్త లభిస్తే ఆమె జీవితం ఏమవ్వాలి? రెండవ భార్యగా నారాయణరావుగారి జీవితంలో అడుగుపెట్టినప్పుడు నాలో ఎలాటి శంకలూ, విచారాలూ లేవు శశీ చూస్తూచూస్తూ మొదటి కూతుర్ని తీసుకుపోయి రెండో పెళ్ళివాడికి ముడిపెట్టటమేమిటని అమ్మ ఒకటే ఏడుపు కాని జ్యోతిష్కుల సలహా ప్రకారం నా జాతకానికి రెండవ పెళ్ళివాడే తగిన భర్త అని నాన్న నిశ్చయం చేసికొన్నాడు నాన్నమీది గౌరవంతోనే కాక, ఆంతరంగికంగాకూడా నేను మనస్ఫూర్తిగా అంగీకరించా ఈ పెళ్ళికి నేను చిన్నప్పటినుండీకూడా నా తోటి వయసు ఆడపిల్లలందరికంటె అదో రకమైన విభిన్న మనస్తత్వాన్నలవరచుకుని పెరిగాను నలుగురు చెల్లెళ్ళకి, ముగ్గురు తమ్ముళ్ళకు అక్కనైన నాలో చిన్నప్పుడే మాతృత్వపు ఛాయలు కన్పించేవి భార్యా వియోగులైన యువకులను చూస్తుంటే మొదటినుండీ

నా కెంతో సానుభూతి వుండేది. సామాన్యంగా ఆడపిల్ల లందరూ రెండవ పెళ్ళి అనగానే నా కొద్దు బాబూ అనేస్తారు. కాని ఈ అమ్మాయి లందరూ ఎందు కలా పొరబడి, వాళ్ళని వెలివేసినట్లు చూస్తారు? జీవిత మాధుర్యాన్ని పూర్తిగా చవిచూడకముందే, యౌవన సహజమైన కోరిక లొకరూపం ధరించక ముందే, అన్ని అనుభూతులకు, అనుభవాలకు ఈ విధురు లెందుకు దూరమవాలి? సృష్టిలోని మాధుర్యానికి బహిష్కృతు లవటానికి వాళ్ళు చేసిన పాప మేమిటి? భార్య చనిపోతే అది అతని తప్పా? ఒక చనిపోయిన వ్యక్తి కోసం మరొకరి నెందుకు చులకన చేయాలి?... యిలా తర్కించుకుని దానిని నే నలా హృదయపూర్వకమైన అంగీకారం తెలియబర్చేసరికి "కర్మకాకా ఏం పోయేకాల మొచ్చిందే! మొత్తానికి ఆ అబ్బకి తగ్గ కూతురు వనిపించుకున్నావు." అని అమ్మ తిట్టిపోస్తుంటే జాలిగా నవ్వుకున్నాను

వివాహాన్ని ఒక గ్రంథంతో పోలిస్తే అందులోని మొదటి పేజీ గేయరూపంలోనూ, మిగిలిన పేజీ లన్నీ గద్యరూపంలోనూ లిఖింపబడి ఉంటాయట ఈ వాక్యం నా జీవితంలో అక్షరాలా నిజమైంది. పెళ్ళయిన మొదటి నెలంతా "హనీమూన్"లో గడచిపోయింది నా పెళ్ళినాటికి గోపీ పన్నెండేళ్ళవాడు మంచిగాని, చెడుగాని ఏ విషయమైనా మనస్సులో గాఢంగా నాటుకుపోయే వయస్సది మొదట్లో నన్ను చూస్తూనే మూలమూలల నక్కి నా బిడియం చూసేవాడు. ఎంతో బతిమాలి మంచి మాటలు చెప్పి, మచ్చిక చేసుకో యత్నించాను. ఏమయినా తినటానికి పెట్టినప్పుడు కొన్ని ప్రత్యేకమైన వస్తువు లతనికోసం కొనుక్కువచ్చినప్పుడు, వాటిని మారు మాట్లాడకుండా తీసుకునేవాడు. కాని అతని కళ్ళల్లో నా యెడల అణచిపెట్టబడిన తిరస్కారభావం జుగుప్సా, స్పష్టంగా చూడగలిగాను నేను మొదట్లో తెల్లబోయాను అతని మనసులో ఏముందో భగవంతుడికే తెలియాలి కాని నేను ఇంట్లో అడుగుపెట్టినదాది, నన్నొక శత్రువుగా తన సుఖసంతోషాలలో భాగం పంచుకుందుకు వచ్చిన రైవల్‌గా చూసేవాడు. ఎంత మాట్లాడకపోయినా ఆ తిరస్కృతి, నిర్లక్ష్యం కొట్టవచ్చినట్టు కన్పడేది అతని కళ్ళల్లో ఆ కళ్ళతో అతను నావంక చూస్తుంటే, ఆ చూపులు వాడిబాణాల్లా వచ్చి నా గుండెల్లో గుచ్చుకునేవి. సవతితల్లి అనగానే తన పురోగమనానికి అడుగా ఒక బద్ధశత్రువులా ఊహించుకుంటాడు ఇరుగు పొరుగు అమ్మలక్కల హితబోధలు అతని ఊహలను కొంతవరకు బలపరచి ఉండవచ్చు





"అలాటిసమయంలో అతనిలోని చెడు తలంపులను తొలగించి అతని దృష్టిలో మాతృమూర్తిగా నా స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే అందుకు నా భర్త సానుభూతి, చేయూతా ఎంతో అవసరం. కాని, చిత్రమేమంటే ఆయనకి 'భార్య' అనే వ్యక్తిమీదున్న అభిప్రాయాలు వేరు. ఇల్లు చక్కదిద్ది, తన శారీరకావసరాలను తీర్చే సాధనంగా తప్ప భార్యని మరో ఉన్నతమైన దృష్టితో చూడలేని పురుష కోవకు చెందిన వ్యక్తి నా భర్త గోపీపైన అపారమైన ప్రేమ ఆయనకు మొదటి కొడుకు - అందునా మాతృహీనుడు అతనిమీద అవ్యాజానురాగం ఉండటం ఏ తండ్రికైనా సహజమే కాని ఆ ప్రేమ ఆయనలోని హితాహిత జ్ఞానాన్ని, ఆఖరికి మానవత్వాన్ని గూడా విస్మరింపజేసేంత గుడ్డిదని తెలిసినప్పుడు నాలో ఆశ్చర్యం, బాధ మొదలైనయ్. ఈ ప్రపంచంలోని పితృప్రేమంతా తన ఒక్కడిలోనే ఉన్నదని ఆయన దృఢవిశ్వాసం. సవతితల్లినయిన నేను తన కొడుకుని ఎక్కడ కష్టపెడతానోనని అనుక్షణం భయపడ్తూంటారు

"చివరికి ఆయనకు నామీద ఎంత అపనమ్మకమంటే ఆయన ఎదురుగా లేనప్పుడు గోపీకి నేను అన్నంకూడా సరిగ్గా పెట్టనేమోనని ఎంత పనున్నాసరే గోపీ భోజనం అయేంతవరకూ ఆయన పక్కన కూర్చుంటారు, నా మనసుకి కష్టం తోచినా. ఆ స్థితిలో ఉన్న ఏ తండ్రికయినా అది సహజమని సరిపెట్టుకున్నాను అంతేకాదు, నా సహృదయతతో, నిర్మలమైన నడవడితో ఎలాగైనా వారి మనసు నాకట్టుకోవాలని

ఆశించాను కాని నా ఆశలన్నీ వమ్మయి నాయి శశీ! నారాయణరావుగారికి తెలివి తేటలైతే ఉన్నాయి కాని, వివేకం శూన్యం. ఆయన భావాలలో 'డెప్త్' ఉంది కాని వాటి పరిధులు చాలా చిన్నవి తను విశ్వసించిన మనిషి నెంతగా ప్రేమిస్తాడో, తను నమ్మని మనుష్యులను అంతగానూ ద్వేషిస్తాడు – గుడ్డిగా

"ఈమూడేళ్ళనుండీ ఆయన ప్రేమను తద్వారా గోపీ ప్రేమను పొందాలని, భార్యగా, తల్లిగా నా జీవితాన్ని సఫలం చేసికోవాలని ఎంతగా తాపత్రయ పడుతున్నానో ఆ సర్వాంతర్యామికే తెలియాలి పిల్లలెప్పుడూ పెద్దవాళ్ళ మనస్తత్వాన్ని బట్టే పెరుగుతారుకదా! జ్ఞానమెరుగని వయసులోనే మాతహీనుడైన గోపీకి తల్లిగాని, ఒక స్త్రీ యొక్క ప్రేమ వాత్సల్యాల విలువా, ప్రాముఖ్యతా తెలియవు ఆయన తరఫున బంధువులెవరూ లేరు ఆమె తరఫు బంధువుల పెంపకానికి ఆయన ఇష్టపడలేదు నౌకర్ల నిర్లక్ష్యపు పెంపకంలో, నాన్నగారి అతి గారాబంతో పెరిగిన గోపీ, చిన్నప్పుడే కరకుగా, పొగరుబోతుగా తయారయ్యాడు. ఇరుగు పొరుగు మాటలు విని సవతితల్లంటే ఒక భయంకరమైన జంతువులా ఊహించుకుంటాడు, తండ్రికి తనమీద గల గుడ్డిప్రేమా, ఆయనకి నా మీద గల అపనమ్మకం అతనిలోని దుష్టభావాలను మరింత ప్రేరేపించినయ్

"ఒక్కొక్కప్పుడు చిన్నపిల్లలు కూడా ఎంత తెలివిగా, సూక్ష్మంగా ఆలోచించగలరో తల్చుకుంటే ఎంత ఆశ్చర్యం వేస్తుందని! ఉదయం సాయంత్రం. గోపీ తండ్రితోపాటే కూర్చుని భోజనం చేస్తాడు ఆ సమయంలో విసుస్తూ, అన్నాన్ని కెలుకుతూ అది బాగాలేదని, ఇది బాగాలేదని వంకలుపెడ్తూ తండ్రిచేత మరీమరీ బతిమాలించుకుంటూ తింటాడు. అలా చేస్తే తను సరీగ్గా అన్నం తిననందుకు తండ్రి బాధ పడతాడనీ, ఆ బాధను ఏదో ఒక వంకతో నన్ను తిట్టే తిట్లరూపంలో వెల్లడి చేస్తారనీ అతనికి తెలుసు ఇక 'లంచ్ టైములో స్కూలు దగ్గర ఉంటం వలన యింటికే వస్తాడు గోపీ అప్పుడు శుభ్రంగా తిని, కసంతా తీర్చుకుంటాడు ఎందుకంటే ఆ సమయంలో తండ్రి యింట్లో ఉండడు మళ్ళీ రాత్రి అన్నాల దగ్గర గునుపుళ్ళు బ్రతిమాలించుకోవటాలు, చివరకు నేను తినే తిట్లు–యిదంతా మామూలుగా జరిగిపోయే కార్యక్రమం కాని తండ్రికి "నీ కొడుకు నీ దగ్గరిలా నటిస్తాడుకాని మధ్యాహ్నంపూట సుష్టుగానే తింటాడనీ, నామీద మీకు ద్వేషం కలిగించటానికి యిలా ప్రవర్తిస్తున్నాడనీ ఆయనతో ఎలా చెప్పను? ఎంత సిల్లీగా ఉంటాయి యిలాటి విషయాలు పైకిచెప్తే! అంతేకాక ఒక పసివెధవ




తిండినిగురించి మరోరకంగా చెప్పటానికి ఏ స్త్రీహృదయమైనా ఎలా ఒప్పుతుంది చెప్పు ?

"శశీ ! ఆ పన్నెండేళ్ళ కుర్రాడిలో ఎంత అసూయా ద్వేషాలు ఉన్నాయో తెలుసా ? రెండేళ్ళక్రితం నాకో కొడుకు పుట్టిపోయాడు వాడు బతికింది మూడు నెలలు. కాని భగవాన్ ! ఆ మూడునెలలూ ఎంత భయంకరంగా జరిగాయో తల్చుకుంటే యిప్పటికీ వళ్ళు జలదరిస్తుంది గోపీ, ముక్కుపచ్చ లారని ఆ పసికందు నెంతగా ద్వేషించేవాడో ! తండ్రిచేతిలో ఎన్నడయినా ఆ పసివాడిని చూస్తేవాలు, కళ్ళల్లో నిప్పులు పోసుకునేవాడు ఆఖరికి వాడు — నా రక్తమాంసాలను పంచుకొని పుట్టిన నా కొడుకు — చనిపోతే — గోపీ ముఖంలో కన్పించిన సంతృప్తిరేఖలను చూచి నాహృదయం ఎలా విలవిలలాడిపోయిందో చెప్పటానికి మాటలు చాలవు. ఇంతచేసినా నాకు గోపీమీద ఏమాత్రం ద్వేషంలేదు శశీ. నాదృష్టిలో చిన్నపిల్లల మనస్తత్వం, వారి ప్రవర్తనలకు పెద్దలే అన్నివిధాలా కారకులు. పూవు పుట్టగానే పరిమళిస్తుందన్న విషయం సత్యదూరం కాకపోయినా ఆసుగంధం దావకుండా కాపాడగల శక్తీ, లేని మార్దవాన్నీ సువాసననీ తెప్పించగల నేర్పూ, బాధ్యతా పెద్దవాళ్ళతో ఉండాలని నాదృఢవిశ్వాసం తండ్రి ఏమాత్రం నామీద గౌరవం చూపినా గోపీలోనిద్వేషం అంత తీవ్రతరంగా ఉండేదికాదేమో," అంటూ ఆగింది రమణి

ఆమె ముఖంవంక రెప్పవాల్చక చూస్తూ, ఆమెమాటలను వింటున్న నేను ఒక్కసారిగా నిట్టూర్పు విడిచాను అమె సంసారాన్నిగురించి వింటుంటే నా మన

సంతా అదోలా అయిపోయింది. ఈ పాతికేళ్ళ స్త్రీలో యింతవిషాదం దాగి ఉన్నదా అని ఆశ్చర్యం వేసింది అన్నిటి కంటే ముఖ్యంగా ఆమె విషాదానికి కారకుడు నారాయణరావుగా నిశ్చయించటం నన్ను మరింత బాధించింది ఆమె నెలాగైనా ఊరడించాలనే ఉద్దేశ్యంతో అన్నాను "గోపీకి యీ సంవత్సరంలో పి యు సీ అవుతుందికదా వచ్చేయేడు ఇంజనీరింగు కోర్సు చదవటానికి ఎలాగో వాల్తేరు వెళ్తాడు అతను దూరంగా ఉంటే నారాయణరావుగారికి మీ మనసు నర్థం చేసుకొనే అవకాశం లభిస్తుందేమో," నన్నా, ఆశగా ఆమె ముఖంలోకి చూస్తూ. రమణి విరక్తిగా నవ్వింది.

"నా కా ఆశకూడా లేదు శశీ ఇంకా నీకు చెప్పనే లేదు నా దౌర్భాగ్యం గురించి. నేను ఆయన జీవితంలో ప్రవేశించకముందే ఆయనకి మరో స్త్రీతో పరిచయ ముంది. ఆమె ఆయనకి ఎం ఏ లో క్లాస్‌మేటుట. ఎం ఏ. లో చేరే సరికె ఆయన వివాహితుడై ఉండటం వలన ప్రేమకలాపాలు జరగటానికి వీలు లేకపోయిందేమో! మొదటిభార్య చనిపోగానే లైన్ క్లియర్ అయింది. ఐనా గమ్మత్తేమిటో తెలుసా! ఆయ నామెని పెళ్ళిచేసుకోలేదు, ఎందుకంటే ఆవిడకు యీయనలాంటి లవర్స్ కొల్లలు. కారక్టర్‌లేని స్త్రీని పెళ్ళి చేసుకుంటానికి నామోషీ కాని ఆవిడమీది మోజును చంపుకునే నిగ్రహశక్తీ, నైతిక బలం మాత్రం శూన్యం - ఛీ! ఏం మగవాళ్ళో! ఇప్పు డామె మద్రాసులో ఉంటోంది ఏడాది కోసారి ఏదో ఒక వంక పెట్టుకొని పోయివస్తారు. మరో ఘోరమైన విషయ మేమిటో తెలుసా? చాలామంది మగవాళ్ళలా యీయన తన యీ లజ్జాకరమైన ప్రవర్తనని నా దగ్గర రహస్యంగా దాచారు. ఆమె తనకు వ్రాసే వుత్తరాలూ, ఆవిడను రకరకాల కోణాల్లో అర్థనగ్నంగా తను స్వయంగా తీసిన ఫొటోలూ యివన్నీ చూపి నన్ను రెచ్చగొట్టాలని చూస్తారు ఆమె ముందు నేను చిల్లిగవ్వకు కూడా పనికిరానని నా మొహాన్నే అంటారు ఒక్కొక్కసారి నా మీద అకారణంగా విరుచుకు పడ్తూ 'ఛీ దరిద్రపు మొహమా! పో నా ఎదుటినుంచి, నువ్వంటే నా కెంత అసహ్యమో తెలుసా? నాలోని ప్రతి అణువూ నిన్ను ద్వేషిస్తోంది నీలాటి కురూపిని ఎందుకు చేసుకొన్నానా అని నేను కుమిలిపోని క్షణం లేదు ఛీ! ఎన్ని పాపాలు చేసే - రంగూ, రుచీ, వాసనా లేని నీలాటి గడ్డిపరకలాటి స్త్రీ భార్యగా లభిస్తుందో' నిన్ను నేను చేసుకుంది నీ అందచందాలూ, చదువు సంధ్యలూ చూసి మూర్ఛపోయి కాదు, చాకిరీ కోసం. నాకూ ఒక పెళ్ళాం ఉందని లోకాన్ని సంతృప్తి పరచటం

కోసం; అంతే. నీలాటి దెయ్యంముఖాన్ని నేను కలలోకూడా భరించలేను అందం లేని ఆడదంటే నా కసహ్యం యిలా ఏవేవో పిచ్చి ట్టిట్టు వాగుతుంటే నాకు ఏడుపుకూడా రాదు. అలా రిక్కప్పగించి ఆయనవంక చూస్తూ కూర్చుంటాను తన లోని పైశాచిక భావాలనూ, ద్వేషాన్నీ కనీసం తనలోనే దాచుకునే పాటి నిగ్రహము కూడా లేని ఆ బలహీనుడిని చూస్తుంటే జాలికూడా వేస్తూంటుంది ఒక్కొక్కప్పుడు.

"కాని నేనలా నిశ్చలంగా కూర్చుంటే ఆయనకి మరింత రేచి కొపుడుతుంది ఎందు కలా మొద్దులా కూర్చుంటావ్? ఎప్పుడూ అలా ముంగిలా కూర్చుని ఏం ఆలోచనలు చేస్తుంటావేం? నన్నూ, నా కొడుకునీ విషం పెట్టి చంపాలని చూస్తుంటావు కాబోలు. మమ్మల్ని చంపే శక్తి నీ కెప్పుడూ ఉండదు...' యిదీ వరస ఎలా ఉంది శశీ మీ నారాయణరావుగారి సంసారగాధ?"

ఈసారి నా నోటివెంబడి మాటలే కరువైనాయి నారాయణరావుగారు ఒక పతిత వ్యామోహంలో పడి అర్ధాంగిని దాసీకన్న హీనంగా చూసేంతటి మూర్ఖుడా? స్వయంగా ఆయన భార్య చెప్తున్నా నమ్మబుద్ధి కాలేదు బయట ఎప్పుడూ చిరునవ్వుతో వెలిగిపోయే ఆయన ముఖం, క్లాసులో పాఠం చెప్తున్నప్పుడు శ్రోతల హృదయాలను ఊపివేస్తూ ఆవేశంతో ప్రతిధ్వనించే ఆయన గంభీరస్వరం ... యిప్పుడు వింటున్న విషయాల్తో పోల్చి చూసుకుంటూనే వణికిపోయాను ఎందుకో అప్రయత్నంగా ఏడుపు వచ్చింది. రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని ఏడవటం మొదలుపెట్టాను

రమణి గాభరా పడుతూ నా దగ్గరికి వచ్చింది. "అరె, పిచ్చిశశీ! ఎందుకలా ఏడుస్తావ్? అయ్యో, నే నెంత కఠినురాలిని! అనవసరంగా లేనిపోని విషయాలన్నీ చెప్పి నీ సున్నితహృదయాన్ని గాయపర్చానే. ఆవేశంలో నేను చెప్పే మాటలు ఎదుటివ్యక్తి మీద ఎలాటి ప్రభావం చూపుతాయో ఆలోచించలేక పోయాను ఇంకా జీవనప్రాంగణంలోకి అడుగుపెట్టని నీకు, మొగ్గలా ఉన్న నీ మనసుకు, ఎంతక్షోభ కలిగించానో! క్షమించు శశీ, నా మూర్ఖత్వాన్ని. నా కథ విని వైవాహిక జీవితం గూర్చి లేనిపోనివన్నీ ఊహించుకుని భయపడకు యుగయుగాలుగా యీ వివాహం స్త్రీ పురుషుల హృదయాలను బంధించాలని ప్రయత్నిస్తోంది కాని అన్నిచోట్లా నాలాటి దౌర్భాగ్యదశ దాపురించదు వైవాహిక జీవితంలోని మాధుర్యాన్నీ, సున్నితమైన ఆనందానుభూతులనూ తనివితీరా చవిచూసే అదృష్టవంతులు ఎందరో ఉన్నారు వివాహం కొందరిని నరక కూపంలోకి తోసినా అదే మరికొందరికి

స్వర్గ ద్వారాలను తెరుస్తుంది శశీ! ఏం భయపడకు,''అంది రమణి, నా తల నిమురుతూ. నే నేడుస్తున్నది నా భవిష్యత్తును గూర్చిన భయంతో కాదని ఆమెతో చెప్పలేకపోయాను ఆ సమయంలో

*    *    *

ఆ సంఘటన జరిగిన మూడోరోజు బుధవారం ఫస్టపీరేడ్ నారాయణరావుగారి క్లాసు కొంతసేపటివరకు క్లాసులో తలెత్తి ఆయన ముఖంవైపు చూడలేక పోయాను ఆ క్రితంరోజు సాయంత్రం రమణి చెప్పిన విషయాలన్నీ గుర్తుకు వచ్చి, భయంతో నాలిక పిడచగటుకు పోయింది ఏదో తప్పు చేసినదానిలా ఆయన ముఖంవంక చూడటానికి సంకోచం వేసింది చివరి కెలాగో అతి ప్రయత్నంమీద తలెత్తాను. అదే ప్రశాంతవదనం, అదే ఆవేశపూరితమైన వాగ్ధాటి డ్రామా మంచి రసవత్తరమైన సన్నివేశంలో ఉంది ఆక్టేవియస్ సీజర్‌తో యుద్ధానికి తలపడిన యాంటోనీ ఓడిపోయే సూచనలు కన్పడుతున్నాయి క్లియోపాట్రా సౌందర్యం సర్వమందు ప్రభావంలా అతన్ని ఆవరించింది అతనిలోని వీరత్వం, ధైర్యసాహసాలూ అన్నీ క్షీణించిపోయినయ్ శత్రుసేనలను తనపేరు చెప్పినంతనే గజగజలాడించే యుద్ధవీరుడు కాడిప్పుడు యాంటోనీ. ఒక ఆడదాని అందానికి లొంగి మాతృదేశానికీ, కన్నబిడ్డల్లాంటి ప్రజలకూ ద్రోహాన్ని తలపెట్టిన అల్పుడు తనలోని యీ అజ్ఞాకరమైన పరివర్తనకు క్రుంగిపోతుంటాడు యాంటోనీ తీరా యుద్ధం తలపెట్టాక వెనుదిరగనూలేడు అటు తనలో అంతర్గతంగా ఉన్న శక్తులను విజృంభింపజేసి శత్రువులతో పోరాడనూలేడు అలాటి సమయంలో నౌకర్లమీద అరుస్తుంటాడు యాంటోనీ ఏయ్ ఎవరక్కడ ఎవరూ మాట్లాడరేం నేను పిలుస్తుంటే? ఒకప్పుడు కనుసైగ మాత్రంతోనే రాజాధిరాజులు నా ముందు వచ్చి తలలొంచేవారే' ఇప్పుడు వాళ్ళంతా ఏమైనారు? అయ్యో ఆనాటి విరాధివీరుడు యాంటోనీ యింకా చావలేదు నేను ఇంకా యాంటోనినే. నన్ను మీరు గుర్తించలేదూ'' అంటూ ఆక్రోశిస్తుంటాడు మాస్టారు ఆ సీన్ చెప్తుంటే విద్యార్థు లందరికి కళ్ళవెంబడి నీళ్ళు కారుతున్నాయి నా ప్రక్కనే కూర్చున్న విమల ఏడుపు నాపుకుంటానికని రుమాలు నోట్లో కుక్కుకుని బలవంతాన వెక్కిళ్ళు నాపుకొంటోంది కాని నా బుర్రమాత్రం పాఠంమీద పేదు ఇంతటి మహా విషాద గ్రంధాన్ని వర్ణిస్తూ, శ్రోతల నూపివేస్తున్న నారాయణరావుగారు భార్యని అంత హింసంగా చూడటం సంభవమా? అపునని ఎందుకో నా అంతరాత్మ అంగీకరించలేదు రమణి గోరంతలు కొండంతలు చేసికొని బాధపడుతోందని, మాతృ



ఒక చిన్నకథ  రమణ అని ఒకరోగి నాకు చాలా కావలసిన స్నేహితుడు – ఒకరోజు అతన్ని మా యింటికి భోజనానికి రమ్మని చీటీ రాసి పంపాను. కాని అతను రానేలేదు కారణ మేమిటా అని అతనిని కలిశాను "నువ్వు పంపిన చీటీని ఒక కెమిస్టుదగ్గర చూపించానోయ్ అత నొక మిక్శ్చర్ తయారు చేసిచ్చాడు దాన్ని పుచ్చుకోగానే ఎక్కడిజబ్బక్కడికి పోయింది చాలా థాంక్స్'' అన్నాడు:... ఇదంతా నా చేఁరాత ఫలితమేమో :...

హీనుడయిన తన కొడుకుమీద ఆయనకు గల జాలితోగూడిన ప్రేమని అర్థం చేసికోలేకపోతో దని అనిపించింది నా కా క్షణంలో సాధారణంగా స్త్రీలు అనుభవించేకన్నా ఎక్కువగా కష్టాలను, బాధలను ఊహించుకుంటారు రమణి కూడా అలాటిదే ననుకున్నాను.

రెండు నెలలు గడచినయ్. ఈలోగా రమణి చెప్పిన విషయాలు మర్చిపోక పోయినా, వాటిని గురించి ఆలోచించటం మానివేశాను, దానికి కారణం పబ్లిక్ పరీక్షలు పరీక్షలన్నీ వ్రాశాను. అన్నిటికన్నా ఇంగ్లీష్ డ్రామా బాగా వ్రాశా ననిపించింది. ఆ పేపర్ వ్రాస్తున్నంతసేపూ క్లాసులో నారాయణరావుగారు చెప్పిన ప్రతివాక్యం, ప్రతిపదం నాచెవుల్లో రింగుమంటూనే ఉంది. పరీక్షలన్నీ అయినాక నారాయణ రావుగారింటికి వెళ్దామని బయలుదేరాను

అప్పుడు సాయంత్రం ఆరుగంటలై ఉంటుంది ఆ రోజురమణి, తన సంసార బాధను చెప్పిన తరువాత, మళ్ళీ ఆమెని చూడనేలేదు. ఎలాగుందో చూద్దామన్న కుతూహలం బయలు దేరింది నాలో. దారిలో నడుస్తూంటే ఎందుకో నాగుండె వేగంగా కొట్టుకున్న ట్టనిపించింది. నారాయణరావుగారి గుమ్మం ఎక్క బోతూనే హఠాత్తుగా నాకాళ్ళు అగిపోయి నయ్ లోపలినుండి ధభీమన్న పెద్దశబ్దం. సన్నగా ఏడుస్తున్న స్త్రీకంఠం – వీటిని చీల్చుకుంటూ నారాయణరావుగారి స్వరం తీవ్రంగా వినిపిస్తోంది.

"ఏం మాట్లాడవేం ? మూగమొద్దులా అలా గుడ్లు మిటకరించి చూస్తావ్ ? ఉండు ఆ కళ్లూడబెరికినగాని నా మనసుకు శాంతి ఉండదు. ఊఁ – మాట్లాడవేం ? గోపీ నేమన్నావ్? వాడీరోజు అన్నం ఎందుకు తినలేదు ? చెప్తావా లేదా ? ఈ రోజు నీరక్తం కళ్ళజూస్తా లం...." ఫెడీ ఫెడీమన్న దెబ్బలచప్పుడు, గట్టిగా అరచిన రమణిగొంతు విన్పించటం, నే నక్కడ నిలబడలేక కాలికొద్దీ పరుగెత్తి మాయింట్లో పడటం ఒకేసారి జరిగినయ్

ఇంట్లో అడుగుపెట్టగానే నా అవతారం చూసి అమ్మహడలిపోయింది? "అదేంటే, ఏం జరిగిందీ ? ఎందు కలా వణికిపో తున్నావ్ ? అప్పుడే ఎందుకొచ్చేశావ్ ? దార్లో ఏ రౌడీయేనా వెంటబడ్డాడా ?" అంటూ ఆదుర్దాగా తనకు తోచిన ప్రశ్నలన్నీ అడగటం మొదలుపెట్టింది. నాకు దుఃఖం ఆగలేదు. అమ్మమీద వాలిపోయి ఏడుస్తూ అన్నాను. "అమ్మా నారాయణరావుగారు నేను వెళ్ళేసరికి పెళ్లాన్ని కొడుతున్నారే; నాకు భయంవేసి తిరిగివచ్చేశాను," అన్నాను

నా కేమీ జరగలేదనటంతోనే అమ్మ మనసుకి కొంచెం ఊరటకలిగింది.

"ఓసి నీ – పిచ్చితల్లీ – అంతేనా ఇంకా ఏం కొంపమునిగిందో నను కున్నాను. మొగుడు పెళ్ళాన్ని కొట్టటం కూడా చోద్యమేనటే! ఏదో మనింట్లో అలాటి విషయా లెప్పుడూ జరగలేదు కాబట్టి నీకు కొత్తగా ఉందిగానీ, యివ్వాళ పెళ్ళాన్నికొట్టటం, రేపు కలవటం – యిదంతా మగవాళ్ళకి మామూలే," అంది. అదే నారాయణరావు గారు కాక మరొకరయితే అమ్మ సమాధానం నచ్చేదేమోకాని ఆఖరికి నారాయణరావుగారిని కూడా అలా సామాన్యరకం మగజాతిలో వేర్చాలంటే మన సేదోలా అయింది.

అంతకుముందు నారాయణరావుగారి దుష్టత్వాన్నిగూర్చి రమణిద్వారా విన్నా అది పరోక్షంగా మాత్రమే. అందుకే అంతగా పట్టించుకోలేదు. కాని యీరోజు ప్రత్యక్షంగా ఆయన వాడిన అసభ్య పదాలను, ఆయన భార్యను గొడ్డును బాదినట్లు కొడ్తున్న దెబ్బలను విన్నాను ఎందుకిలా జరిగింది ? బయట అందరికీ




తలలో నాలికలా మెసల్తూ, తన వాక్పటిమతో విద్యార్థిలోకాన్ని ఊపేస్తూ, షేక్స్పియర్‌వంటి మహాకవుల పాత్రలలో తను లీనమైపోవటమేకాక వాటి వర్ణనలతో వందలాది విద్యార్థులను మంత్రముగ్ధులను చెయ్యగలిగిన నారాయణరావు గారు యింట్లో అంత కర్కశంగా, నిరంకుశంగా, చదువూ, సంధ్యా లేని పామరుడికన్న హీనంగా, పశువులా ఎలా ప్రవర్తించగలిగాడు? ఏ మనిషి మనస్తత్వమైనా యింట్లో ఒక రకంగా, బయట ఒక రకంగా – యింత తేడా ఎలా ఉంటుంది? మనుష్యులందరిలోనూ యీ భిన్న ప్రకృతు లుండటం సహజమేనా? అయితే బయటున్నంతసేపు నారాయణరావుగారు తనలోని పశుభావాలను ఎలా దాచిపెట్టుకోగల్గుతున్నారు? లోపల విషభాండం ఉంచుకుని పైకంత కమ్మగా ఎలా మాట్లాడగల్గుతున్నారు? పైగా నాముందు భార్యమీద ఎంతో ప్రేమ ఒలకబోస్తూ, వేళాకోళాలాడ్తూ ఎలా నటించగలిగారు? ఆ లేత వయస్సులో, చదువు తప్ప మరో ప్రపంచ జ్ఞానమే తెలియని నాకు అప్పుడా ప్రశ్నలకు సమాధానాలు దొరకలేదు.

తరవాత వయసుతోపాటు యిలాంటి

అనుభవాలసంఖ్యకూడా పెరిగింది. ఎం ఏ. లో ఉండగా మా ప్రొఫెసరొకాయన కాలేజీలో ఎప్పుడూ ముఖం ముడ్చుకుని కన్పడేవారు. ఆయన ఉనికి కేవలం ప్రాధాన్యత, అవసరం లేదన్నట్లు నడచుకునేవారు. పైగా క్లాస్‌లో పాఠం కూడా సరీగ్గా చెప్పేవారుకాదు. ఇంగ్లీషులో ఒక వాక్యం కూర్చాలంటే ఐదు నిమిషాలు తన్నుకునేవారు ఆయన ముఖంలో 'నవ్వు' అనే భావాన్ని ఆ కాలేజీలో ఏ స్టూడెంటూ చూసిఉండడు. 'ఈ మాడు మొహాన్ని పాపం ఆయన భార్య ఎలా భరిస్తోందో' అనుకునే వారు ఆడపిల్లలు. ఒకసా రెందుకో అనుకోకుండా మా ఫ్రెండుతోపాటు ఆయనింటికి వెళ్ళాల్సి వచ్చింది. ఇంట్లో ఆయన్ను చూస్తున్నంతసేపూ ఆశ్చర్యంలో మునిగిపోయి కూర్చున్నాను నేను. ఎప్పుడూ కనుబొమలు ముడివేసుక్కూర్చునే ఆయన యింట్లో ఎంతో హాయిగా, ముఖం నిండుగా నవ్వుకుంటూ మమ్మల్ని పలకరించారు ఆయన భార్యకూడా ఎంతో సర్దాగా నాతో కూర్చుని కబుర్లు చెప్పింది ఇక ఆయన సుపుత్రులు సరాసరి, ఒకరు ఆయన ఒళ్ళో, మరొకరు బుజంమీదా, ఒకరు తలమీదా ఎక్కి తొక్కుతూ నానా హంగామా చేస్తున్నారు. అయినా ఏమాత్రం విసుక్కోలేదాయన. పైగా సంతృప్తితో కూడిన చిరునవ్వులు చిందులాడాయి ఆయన ముఖమండలంలో.

ఇవన్నీ చూస్తుంటే మానవహృదయమంత బ్రహ్మాండమైన మిస్టరీ మరొకటి లేదనిపిస్తోంది. ప్రతిమనిషికీ—ముఖ్యంగా పురుషులకు రెండురకాల జీవితా లుంటాయి; ఇంటా — బయటా. కొందరు పురుషులు సుఖంగా, ప్రశాంతంగా గృహజీవితం వెళ్ళిపోతూంటే చాలని సంతృప్తి పడుతుంటారు. వీరికి నలుగురులో తమ పేరు మారుమోగిపోవాలనీ, తమ వ్యక్తిత్వా న్నందరూ గుర్తించాలనీ ఆత్రుత వుండదు. ఇలాటి వారికి ఆశయాలూ, ఆవేశాలూ చాలా తక్కువ. కాని కొందరు మగవాళ్ళు స్వయంకృతాపరాధంవల్ల నేమి, లేదా ఖర్మంకొద్దీనో యింటిని నరకంగా చేసికొని, యింట్లోని ప్రతి వస్తువునూ, ప్రతి మనిషినీ ద్వేషిస్తూ, అశాంతికి లోనవుతారు. ఆ మానసిక బాధలనుండి తప్పించుకునేందుకు మరో ప్రపంచాన్ని సృష్టించుకుని, అందులోనే సంతోషాన్ని వెతుక్కుందామని ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలో వారు మహాకవులు కావచ్చు, చిత్రకారులు కావచ్చు, వక్తలు కావచ్చు, రాజకీయవేత్తలు కావచ్చు. కాని ఈ మహాలక్షణా లేవీ వారి హృదయ పరిధుల నిసుమంతయినా పెంచలేవు. వారి మేధస్సు వికసిస్తున్నకొద్దీ వారి హృదయము సున్నితమైన భావాలకు చలించే శక్తిని కోల్పోతుంది. అందుకే తమ




కేమాత్రం సంబంధంలేని వందలాది ప్రజలను ముగ్ధులను గావించగలవారికి ఇంట్లో తననే సర్వస్వంగా భావించుకుని తనకోసమే బ్రతుకుతున్న ఒక స్త్రీ హృదయాన్ని అర్థంచేసికొనేపాటి ఓపికా అవసరం ఉండవు వివేకాన్ని కోల్పో కుండా యిటు అర్థాంగి హృదయంలోనూ అటు సంఘంలోనూకూడా గౌరవనీయ మైన స్థానాన్ని పొందే 'బాలెన్స్డ్ మైండ్' గల పురుషులు చాలా తక్కువ.

నారాయణరావుగారి పరిచయంతో యిలాటి నిత్యసత్యా లెన్నిటినో నేర్చు కున్నాను నేను. అంతే కాదు. అంత వరకు మానవ స్వభావాన్ని చాలా త్వరగా, పరిపూర్ణంగా అర్థం చేసుకో గలనన్న నా అహంభావం ఆ అనుభ వంతో పటాపంచలయిపోయింది

'Show me your shoe, I shall tell your character,' అన్న సైకలా జిస్టు వాక్యంలో అతిశయోక్తి లేకపో వచ్చు. కాని అలాటి చిన్న ఆధారాలతో మనిషిలోని ఒక 'యాస్పెక్టుని' మాత్రమే తెలిసికోగలం. మానవ మనస్తత్వాన్ని మొత్తంగా పరిశీలిస్తే అంతకన్న కాంప్లెక్సుస్టడీ ఉండ దనిపి స్తుంది ఒక ప్రదేశంలో ఒక సంద ర్భంలో ఒక రకంగా ప్రవర్తించిన మనిషి, అదే ప్రదేశంలో అలాటి సంద ర్భాన్నే ఎదుర్కోవలసివస్తే అలాగే ప్రవర్తించితీరుతా డనే గ్యారంటీ ఏం లేదు. అనుక్షణం మారుతూ, ఏ శాస్త్ర పరిశోధనలకూ, ఏ సామాన్య సూత్రా లకూ అందని యీ మానవ స్వభావం ఎంత చిత్రమైనదో!